# రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి




మోపాల్‌లోని బీసీ సంక్షేమ పాఠశాల వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు



చందూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

మోపాల్ (ఖలీల్‌వాడి)/ చందూర్/ ఆర్మూర్ టౌన్, జనవరి 1 : వాహనదారులు, పాదచారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవ ప్రారంభోత్సవంలో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో మోపాల్ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ బాలుర వసతిగృహంలో బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వర్, మోటరు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, రాహుల్, శ్రీనివాస్, జిల్లా ఐరాడ్ మేనేజర్ వర్షా నిహాంత్, వసతిగృహ సంక్షేమాధికారి అశోక్ పాల్గొన్నారు.

### రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

చందూర్ మండల కేంద్రంలోని విక్టరీ ఉన్నత పాఠశాలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, సమాధానం చెప్పిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అధినేత కొడాలి రాంచందర్ రావు, షేక్ ఖాజా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ఎంవీఐ వివేకానందరెడ్డి వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడుపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు.

## అర్ధరాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- 200 కేసులు నమోదు, వాహనాలు సీజ్



జిల్లా కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వినాయక్‌నగర్, జనవరి 1 : న్యూఇయర్ వేడుకల్లో భాగంగా యువత మద్యం తాగి వాహనాలు నడపకుండా, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. డిసెంబర్ 31 సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో ఏసీపీల పర్యవేక్షణలో సివిల్, ట్రాఫిక్, స్పెషల్ పార్టీ సిబ్బంది మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రధాన కూడళ్ల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 140 మందిపై కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఆర్మూర్, బోధన్ డివిజన్ల ఏరియాలో కలిపి సుమారు 200 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని నేడు (గురువారం) కోర్టుల్లో హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

## పోలీసులకు సేవా పతకాలు

వినాయక్‌నగర్, జనవరి 1 : పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి హోంశాఖ గుర్తింపు లభించింది. ఉత్తమ సేవలు అందిస్తున్న సిబ్బందిని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎంపిక చేసి, మహోన్నత సేవ, ఉత్తమ సేవ, సేవా పతకాలను ప్రకటించినట్లు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని స్పెషల్ బ్రాంచ్, ఎన్ఐబీ, సీఐడీ విభాగాలతో పాటు మహిళా పోలీస్ ఆఫీసర్లు, సిబ్బందికి సైతం పతకాలు వరించాయి. మహోన్నత సేవా పతకానికి ఎంపికైన వారిలో ఎన్ఐబీ ఎస్సై కె.బాబూరావు, సీఎస్‌బీ ఎస్సై జి.శ్రీనివాస్, ఉత్తమ సేవా పతకానికి ఎంపికైన వారిలో సీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కేతావత్ చందర్, సీసీఆర్‌బీ మహిళా హెడ్ కానిస్టేబుల్ పి.సునంద, సేవా పతకాలకు ఎంపికైన వారిలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్.శ్రీలత, వీఆర్ ఎస్సై సత్యం కుమార్, ఇంటలిజెన్స్ కానిస్టేబుల్ జి.గంగాధర్‌తో పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న మొత్తం 41 మంది సిబ్బందికి పతకాలు లభించినట్లు అధికారులు జాబితా వెల్లడించారు.

## రేపు ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో బీసీ మహాజన సభ

డిచ్‌పల్లి, జనవరి 1 : ఈనెల 3న సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మహాసభను నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ బీసీ మహాజన నాయకులు సతీశ్, హరీశ్, సంతోష్, రమేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను టీయూలో బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని చెప్పి మోసం చేసిందని, ప్రభుత్వ తీరుకు నిరసనగా బీసీ మహాజన సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. మహాసభకు నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంగమేశ్, పురుషోత్తం, రాహుల్, రాజేశ్, రాకేశ్, సంతోష్, నాగేంద్ర, శివకుమార్, నాగసాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



టీయూలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ మహాజన నాయకులు

## స్నేహ సొసైటీకి ఆర్థిక సహాయం అందజేత




స్నేహ సొసైటీ కార్యదర్శికి చెక్కును అందజేస్తున్న రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నోముల రాంచంద్రారెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 1 : జిల్లాకేంద్రంలోని స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థకు ఎన్ఆర్ఐ, రామ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు నోముల రాంచంద్రారెడ్డి బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థపై ఉన్న నమ్మకంతో దివ్యాంగుల ఉన్నతి కోసం వృత్తి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పారు. మానసిక దివ్యాంగులు నిర్వహించిన యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి సిద్ధయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి, రాం చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లమాప్రభు శివాలయ కమిటీ ఎన్నిక

చందూర్, జనవరి 1 : మండలకేంద్రంలోని అల్లమాప్రభు శివాలయ నూతన కమిటీని గ్రామస్తుల సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రపోసాని చిన్నసాయిలు (శ్యాం సుందర్), ఉపాధ్యక్షుడిగా కొత్తోళ్ల నర్సారెడ్డి, కోశాధికారిగా కుందనం నర్సింహచారి, కార్యదర్శిగా ఎర్రపోసాని శ్రీనివాస్‌తోపాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన సంవత్సర శోభ.. ఆలయాలు కిటకిట



జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వరాలయంలో భక్తుల క్యూ

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. కొత్త ఏడాది అంతా తమకు మంచే జరగాలని కోరుకుంటూ నగరంలోని ప్రముఖ ఆలయాలకు తరలివెళ్లారు. దీంతో ఆలయాలు కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, జెండా గుడి, ఉమామహేశ్వరాలయం, ఉత్తర తిరుపతి క్షేత్రం, శుభం కరోతి గణపతి ఆలయం, నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల తదితర ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## హమాలీల నిరవధిక సమ్మె



డిచ్‌పల్లిలో సమ్మె చేస్తున్న హమాలీలు, ఏఐటీయూసీ నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 1 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హమాలీలు నిరవధిక సమ్మెకు దిగారు. రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీస్ యూనియన్ పిలుపుమేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హమాలీలు బుధవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. హమాలీల కూలీని క్వింటాలుకు రూ.26 నుంచి రూ. 29కి పెరిగిన రేట్లను అమలుచేయడంతోపాటు ఏరియర్స్‌తో కలిపి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీలు, స్వీపర్లకు రూ. 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

ఇందల్వాయి, జనవరి 1 : మండలంలోని నల్లవెల్లి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకమండలి నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రమేశ్, పాలకమండలి సభ్యులు, సీఈవో తేజాగౌడ్, క్యాషియర్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలు సుభిక్షంగా ఉండాలి

మోర్తాడ్, జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరం 2025లో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నూతన సంవత్సర ఆరంభం, ఎమ్మెల్యే పెండ్లిరోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లక్ష్మీనరసింహస్వామి, ఇస్కాన్ గోల్డెన్ టెంపుల్‌లో సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సరంలో ప్రజలు ఎటువంటి బాధలు లేకుండా, సుభిక్షంగా ఉండాలని అన్నారు.



పూజలు చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి దంపతులు

### కాలువ ఇలా.. రాకపోకలు ఎలా..?

ఎడపల్లి, జనవరి 1: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో జైతాపూర్ – బ్రాహ్మణపల్లి రోడ్డు మార్గంలో ఆర్అండ్‌బీ అధికారులు 15రోజుల క్రితం డీ56 కెనాల్ తవ్వకం పనులు చేపట్టారు. పైపులు వేసిన అనంతరం మట్టిని పూడ్చకుండా అలాగే వదిలిపెట్టారు. దీంతో రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం గ్రామంలో ఓ వ్యక్తి మరణించగా.. అంత్యక్రియలు నిర్వహించేందుకు కెనాల్ దాటే క్రమంలో ఇబ్బంది పడ్డామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.



శవాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

## ఘనంగా బీమా కోరెగావ్ శౌర్య దివస్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాల సంఘాల నాయకులు

ఆర్మూర్‌టౌన్, జనవరి 1: మాలల హక్కుల కోసం బీమా కోరెగావ్ మహర్ యుద్ధవీరుల స్ఫూర్తితో పోరాడుదామని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కో–చైర్మన్ అంగరి ప్రదీప్ పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ.. మాల సంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘం, దళిత ఐక్య సంఘటన, యశోబుద్ధ ఫౌండేషన్, పలు దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బీమా కోరేగావ్ దివస్‌ను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

ఏర్గట్ల, జనవరి 1: మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీవో శివచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల కార్యదర్శులకు ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. గ్రామాల్లోని అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు.

# 9న చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలి

### అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్



బోధన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు




ఆర్మూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

బోధన్, జనవరి 1: రైతు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు ఐక్య సంఘం( ఏఐయూకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ కోరారు. బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి బుధవారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు రుణమాఫీ అందరికీ వర్తించేలా చూడాలని, రైతు భరోసా జాప్యం లేకుండా అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రెండువందల రోజులు పనికల్పించాలని, నిరుద్యోగులకు ఉద్యోగభృతి, భూమిలేని వారికి భూమి, ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు, పేదలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టి నడిపి నాగన్న, కమిటీ సభ్యులు పడాల శంకర్, మండల కార్యదర్శి సుల్తాన్ సాయిలు, గుంతల సాయిలు, బొంతల సాయి లు, జి. సీతారాం, సురేందర్ సింగ్, సున్నం పోశెట్టి, శంకర్ గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

***హామీలను నెరవేర్చాలి..***

ఆర్మూర్‌టౌన్, జనవరి 1: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో డిమాండ్ డే నిర్వహించనున్నట్లు అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం (ఏఐయూకేఎస్) నాయకుడు ప్రభాకర్ తెలిపారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో ఖరీదుదారులు, కమీషన్‌దారులు సిండికేట్ అయ్యారని, పసుపు రైతులను నిండా ముంచుతున్న తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు ఉద్యమం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమావేశంలో నాయకులు బి.కిషన్, ఆకుల గంగారాం, ఇస్తారి రమేశ్, సాయిలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్**

NAMASTHE TELANGANA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★I, **NERALLA HANMANTHU** (Old Name) R/o. H.No.5-9-75, Budhawarpet,Town and Dist Nirmal,Telangana. Have Changed My Name As **NERELLA HANMANTHU S/o Late NERALLA SHIVVIAH** (New Name)
NTZ-338373

**EDUCATION**

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337305

**WANTED**

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### విషప్రయోగంతో 60 నాటుకోళ్లు మృతి

నందిపేట్, జనవరి 1: మండలంలోని గంగాసముందర్ గ్రామానికి చెందిన మోతె సాయన్నకు నాటుకోళ్లు ఉన్నాయి. కాగా సుమారు కిలోన్నర రెండు కిలోలల బరువున్న నాటుకోళ్లకు గిట్టని వారు విషం పెట్టినట్లు తెలిపాడు. దీంతో 60 కోళ్లు, గొల్ల మల్లుకు చెందిన ఒక గొర్రెపిల్ల చనిపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టని వారు ఇలా చేయడం ఇది మూడోసారని పేర్కొన్నారు. విషప్రయోగం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. విషం కలిపిన బియ్యం ఘటనా స్థలంలో దొరికాయని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులు, అధికారులకు తెలియజేసినట్లు వివరించారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

## బోధన్ ఎన్టీఆర్ అభిమాన సంఘం కార్యవర్గం ఎన్నిక



విరాళాన్ని అందజేస్తున్న అమర్‌నాథ్‌బాబు

బోధన్, డిసెంబర్ 1: బోధన్ రాకాసీపేట్‌లోని అయ్యప్ప కమాన్ వద్ద ఎన్టీఆర్ అభిమానుల సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెంపాటి శివన్నారాయణ, ఉపాధ్యక్షులుగా సాంబి రెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.గాంధీ, సంయుక్త కార్యదర్శులుగా ఏశాల రవీందర్, బి. కృష్ణా రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ కృష్ణ మోహన్, సలహాదారులుగా ఎం. అమర్‌నాథ్ బాబు, తూము శరత్ రెడ్డి, రాజేశ్వర్ పటేల్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పామేశ్వర్ రావు, పాండు రంగా రెడ్డి, బాల్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, బాలస్వామి, జి. సూరి బాబు, రామారావు, రావెల్ల శ్రీనివాస్, ఎం. పెద్ద బ్రహ్మయ్య, ఎం. సుధాకర్, పావులూరి వెంకటేశ్వర్ రావు నియామకం అయ్యారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించగా.. ఇందుకోసం అమర్‌నాథ్‌బాబు రూ.1,11,600, పాండు రంగా రెడ్డి రూ.పది వేలు విరాళంగా అందజేశారు.

### ఆరు కేసులు నమోదు

నవీపేట, జనవరి 1: నవీపేటలో మంగళవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. పట్టుబడిన వారిని కోర్టులో గురువారం హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

### వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్, జనవరి1: ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

నవీపేట, జనవరి 1: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ బుధవారం తెలిపా రు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం బోర్గాం గ్రామానికి చెందిన నవీద్ తన టిప్పర్ ద్వారా రెంజల్ మండలం నుంచి అనుమతి లేకుండా ఇసుకను మంగళవారం రాత్రి తరలిస్తున్నట్లు తెలిపారు. నవీపేట శివారులో తనిఖీ చేయగా.. అనుమతి పత్రాలు లేవన్నా రు. దీంతో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. జరిమానా నిమిత్తం మైన్స్ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఇటీవల నమస్తే తెలంగాణలో 'యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి తనిఖీలు చేపడుతున్నారు.

## వరదకాలువకు నీటి విడుదల పెంపు

మోర్తాడ్, జనవరి 1: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరదకాలువకు అధికారులు నీటివిడుదలను బుధవారం పెంపుదల చేశారు. మంగళవారం 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు.. బుధవారం దానిని ఐదు వేలకు పెంచారు. కాకతీయకాలువకు 5,500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 200 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతలకు 487 క్యూసెక్కులు, గుత్ప ఎత్తిపోతలకు 270 క్యూసెక్కులు, సరస్వతీకాలువకు 700 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80,5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1089. 60 అడుగుల (75.314టీఎంసీల) నీరు నిల్వ ఉన్నది.